


## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## సాధారణ బహుమతి పొందిన నవల

### (గత సంచిక తరువాయి)

**ఫ్లైట్ ఎక్కి కూర్చున్నాడు హేమంత్**. రన్‌వే మీద టేక్ఆఫ్‌కు రన్ తీస్తున్న విమానం కన్నా వేగంగా, అతడి మనసు ముందే నాగపూర్‌కు చేరిపోయింది.

లతను దగ్గరకు తీసుకుని గుండెకు హత్తుకున్నాడు "లతా..లతా." అంటూ

"హలో సర్..." ఉలిక్కిపడి కళ్ళు తెరిచి చూసాడు.

"గుడ్‌మార్నింగ్ సర్. ప్లీజ్ ఫాస్టెన్ యువర్ సీట్ బెల్ట్." ఎయిర్ హోస్టెస్ చెప్తుంది.

"థాంక్యూ." అంటూ బెల్ట్ పెట్టుకున్నాడు.

బ్రేక్‌ఫాస్ట్ వచ్చింది.

ముందు రోజు అసలు భోజనం చెయ్యక నీరసంగా వుంది అనిపించింది. బలవంతంగా కొంచెం తిన్నాడు ఎలాగో.

కళ్ళు తెరిచినా, మూసినా లతే కనిపిస్తుంది అతడికి. విమానం ల్యాండ్ అవుతుంది. టెన్షన్‌గా ఉంది అతడికి. తను వెళ్ళేసరికి ఏం పరిస్థితో?ఎయిర్‌పోర్ట్‌లో కారు, డ్రైవర్ రెడీగా ఉన్నారు.

కారు హాస్పిటల్‌కు చేరేలోగా అతడి గుండె స్పందన పెరిగింది. కారు ఆగుతుండగానే దిగి పరుగుతీశాడు హేమంత్ లోపలకు.

బయట ఎవరూ లేరు. నిశ్శబ్దంగా ఉంది అంతా. షూస్ విప్పేసి, బ్రీఫ్ లాంజ్‌లో వదిలేశాడు. తొందరగా అల్మార లోంచి డాక్టర్ ఏప్రన్ వేసుకుని ఐసియు వైపు వెళ్ళాడు హేమంత్. నెమ్మదిగా తలుపు నెట్టుకుని లోపలకు వెళ్ళాడు హేమంత్. వెను తిరిగి చూసిన అరుణ్, వేగంగా వచ్చాడు నిలబడిపోయి చూస్తున్న హేమంత్ దగ్గరకు.

"లతరా..లత ఎలావుంది? అరుణ్ భుజాలు పట్టుకుని కుదుపుతూ బిగ్గరగా అడిగాడు.

"బాగానే వుందిరా.. నీతో ఫోన్ మాట్లాడాక మగతగా నిద్రపోయింది ఇంజెక్షన్ వల్ల. మళ్ళీ తెల్లవారుతూనే గొడవ మొదలుపెట్టిందిరా. ఏడుపు, హేమ్....హేమ్ అంటూ."

నెమ్మదిగా లత బెడ్ దగ్గరకు వెళ్ళాడు హేమంత్.

డాక్టర్ విన్సెంట్, హేమంత్ ముఖంలోకి చూసి "వచ్చేవా?" అన్నాడు నిర్లిప్తంగా.

"లతా..లతా." అంటూ కుదిపాడు. తల నిమిరాడు. చెయ్యి చేతిలోకి తీసుకున్నాడు. లతలో చలనం లేదు.

"బిపి డౌన్ అయిపోతుంది. ఏం చెయ్యాలి సర్?" గట్టిగా అరిచాడు హేమంత్ మానిటర్‌లో మారుతున్న అంకెలను చూస్తూ.

హేమంత్ భుజంపై చెయ్యివేశాడు డాక్టర్ విన్సెంట్.

"మెడికల్ పరంగా చెయ్యవలసింది, చెయ్యగలిగిందీ అంతా చేసాం. నువ్వు వస్తావు అని చెప్తుంటే నమ్మటంలేదు లత.

"అసలు నాకేమైంది? హేమంత్ ఎందుకులేదు అరుణ్?" అంటూ ఒకటే ఏడిచింది. ఎవరేం చెప్పినా వినే స్థితిలో లేదు. నీకు ఏమో జరిగిపోయింది అని అనుకుంటుంది. 'హేమంత్ లేకుండా నేనూ బ్రతకను' అంటూ సెలైన్, ఆక్సిజన్ చాలా వైల్డ్‌గా లాగి పడేసింది. చాలా చాలా మైల్డ్ సెడెటివ్ ఇచ్చాను. కామ్ అయి నిద్రలోకి జారుకుంది. బాగానే వుంది. కాని ఒక గంట నుంచి ఇదే పరిస్థితి. ఆమె దేనికీ రెస్పాండ్ అవ్వటంలేదు.

"నో, ఏం చెయ్యాలి? ఏం చెయ్యను?" అతడు అశాంతిగా లత బెడ్ దగ్గరే నిలబడి అరుస్తూ డాక్టర్ విన్సెంట్ చేతులు పట్టుకున్నాడు. స్థిమితం తప్పిన అతడు చుట్టూ చూసాడు కంగారుగా.

"డాక్టర్ ఇక్కడ ఎవరైనా సీరియస్ పేషెంట్లు ఉన్నారా? నాకు ఒక్క ఛాన్స్ ఇవ్వండి." అంటూ బిగ్గరగా అరుస్తున్న హేమంత్ ను, "సీరియస్‌గా ఎవరూ లేరు కానీ.. కొంచెం కామ్ గా ఆలోచించరా హేమంత్... ప్లీజ్" అరుణ్, హేమంత్‌ను దగ్గరకు తీసుకోబోయాడు. దూరంగా నెట్టేసాడు అతడు.

"ఇపుడు కూడా నా గురించే నీ బాధ.. లత ఏమైపోయినా సరేనా?" గట్టిగా అరిచాడు.

హేమంత్ కంగారుగా పాకెట్‌లోనుంచి సెల్ తీసాడు.

డాక్టర్ విన్సెంట్ అక్కడ ఉన్న పేషెంట్ల బెడ్‌ల చుట్టూ ఉన్న కర్టెన్లను క్లోజ్ చేయించాడు.

"ఒరేయ్ అరుణ్, ఇలారా సాంగ్స్ లిస్ట్ తియ్యి" అన్నాడు కంగారుగా. అతడి చేతివేళ్ళు కంపిస్తున్నాయి. ఫోన్ కింద పడిపోయింది.

అది లత బెడ్ కిందకు జారిపోయింది.

అరుణ్ వేగంగా తీసి మళ్ళీ ఓపెన్ చేసిచ్చాడు అతడికి.

"ఇదిగో ఈ సాంగ్ ప్లే చెయ్యి" అంటూ తనే ఆన్ చేసాడు. "ఇదుగోరా ఇది లత చెవి దగ్గరే పట్టుకో. ఆగకుండా చూడు. "

'జొ వాదా కియా ఓ నిభానా పడేగా...' సెలయేరు గలగలలలా, వెన్నెల పూలు కురుస్తున్నట్టుగా సాగిపోతుంది లతకు ఇష్టమైన తాజ్ మహల్ పాట. సముద్రపు అలలు పాదాలను తాకుతుండగా, లత తన ఒడిలో తల పెట్టుకుని మైమరచి విన్న మధుర గీతం!

స్పీకర్ ఆన్ చేయటం వల్ల గదిలో మారుమ్రోగుతుంది పాట.

హేమంత్ లత అరిచేతులను తన చేత్తో రుద్దుతున్నాడు. అతడి కాళ్ళు షివర్ అవ్వటం మొదలు పెట్టాయి.

"బ్రింగ్ మి ఏ ఛెయిర్, అనేబుల్ టు స్టాండ్." అన్నాడు హేమంత్. అతడి నుదుట పట్టిన చెమటను చూశాడు డాక్టర్ విన్సెంట్. సిస్టర్ తెచ్చిన ఛెయిర్‌ను "కూర్చో హేమంత్" అంటూ దగ్గరకు జరిపాడు.

కుర్చీలో కూలబడ్డాడు అతడు, తలను లత బెడ్‌పై పెట్టుకుని. "నిన్ను....పదే పదే నిందించాను... అమ్మను, నాన్నను నా దగ్గరనుంచి ....లాగేసుకున్నావని... ఆ... కోపంతో... మళ్ళీ లతను కూడా నాకు దూరం.. చెయ్యకు...."

అతడి మాటలు ఆగిపోయాయి. వింటున్న విన్సెంట్ హేమంత్ వీపుపై తట్టి "హేమంత్.. హేమంత్" అని పిలిచాడు. అతడి నుంచి ఏ స్పందనా లేదు. అచేతనంగా మారిన హేమంత్ ను చూసి అతడు అప్రమత్తమయ్యాడు. "బ్రింగ్ ఆక్సిజన్!" బిగ్గరగా అరిచాడతడు. స్టాఫ్ పరుగులు తీశారు.

అరుణ్ జరిగేది కన్నీళ్ళతో గమనిస్తున్నాడు. కాని లతను, ఆమె చెవి దగ్గర ప్లే అవుతున్న ఫోన్‌ను వదిలి లేవలేదు. 'ఇపుడైనా వాడి ఆర్డర్ ఫాలో అవ్వాలి! ' ధృఢంగా అనుకున్నాడు. పాట ఆగిపోతుంటే తిరిగి ప్లే చేస్తున్నాడతడు. రెండో చేత్తో కన్నీళ్ళు తుడుచుకుంటున్నాడు.

అచేతనంగా ఉన్న హేమంత్‌ను పక్కగా ఉన్న మరో బెడ్ మీదకు చేర్చి తొందర తొందరగా ఆక్సిజన్ అమర్చాడు జూనియర్ డాక్టర్ మదన్. ఒకరు అతడి చేతికి సెలైన్ అమర్చారు.

అరుణ్ మౌనంగా దుఃఖిస్తున్నాడు. లత చేతిని చేతిలోకి తీసుకున్నాడు అతడు.

"నేను ...తప్పు చేశాను... క్షమించమ్మా లతా.. దయచేసి నన్ను శిక్షించకు.. హేమంత్‌ను తీసుకుపోకు నీతో.. ప్లీజ్.. నువ్వు వెనక్కురా.. వెనక్కురా.."

అరుణ్ దుఃఖం కట్టలు తెంచుకుంది హేమంత్ పరిస్థితి చూసి.

"హేమంత్..హేమంత్.." అంటూ అతడి చెంపలపై తడుతున్నాడు డాక్టర్ విన్సెంట్.

హేమంత్ చేతి వేళ్ళలో కదలిక వచ్చింది. ఆక్సిజన్ లెవెల్ పెరుగుతుంది నెమ్మదిగా. చూసిన విన్సెంట్ కళ్ళు చెమర్చాయి.

"హేమంత్..లే నాన్నా!" గుండెను కుదుపుతున్న దుఃఖాన్ని ఆపటం ఆయనవల్ల కావటంలేదు.

నెమ్మదిగా కళ్ళు తెరిచాడు హేమంత్. లేవబోయాడు కంగారుగా "లతా!" అంటూ. అడ్డుగా ఉన్న సెలైన్ పైప్‌ను, ఆక్సిజన్ మాస్క్‌ను లాగేయబోతుంటే ఆ చెయ్యిపట్టుకుని ఆపాడు డాక్టర్ విన్సెంట్.

"ఆగు హేమంత్" అంటూ.

"నాకు సెలైనా? వాట్ హ్యాపెండ్? వాట్ ఈజ్ దిస్?" అంటూ బెడ్‌మీద నుంచి దిగిపోతున్న హేమంత్‌ను వారించాడు ఆయన.

"హేమంత్, నువ్వు 'వాట్ ఈజ్ దిస్' అన్నావు కదా. అటు చూడు ఒకసారి."

లతకు కనెక్ట్ అయివున్న మానిటర్ వైపు చూపించాడు అతడు "వాట్ ఈజ్ దట్?" అంటూ.

హేమంత్ అటు చూశాడు. లత బిపి, పల్స్ రేట్ స్లోగా పెరుగుతున్నాయి. హేమంత్ కళ్ళు మెరిసాయి.

"థ్యాంక్ గాడ్!" అరిచాడు సంతోషంగా.

హేమంత్ వైపు కంగారుగా చూసిన అరుణ్, తన చేతిలో ఉన్న లత చేతిలో కదులికకు ఉలిక్కిపడి చూశాడు.

"హేమంత్!" అంటూ చిన్నగా కేక పెట్టాడు అరుణ్ ఉద్వేగంతో.

విన్సెంట్, సిస్టర్‌కు చెప్పాడు హేమంత్ చేతికున్న సెలైన్ తొలగించమని.

హేమంత్ లత చెయ్యిపట్టుకున్నాడు, "లతా.. వచ్చానురా.. నీ కోసం.." అంటూ. అంతకుమించి అతడికి మాటలు రాలేదు. లత కనురెప్పలలో కదలిక వచ్చింది. అరుణ్ హేమంత్‌ను చుట్టేశాడు వెనకనుంచి చుట్టూ చేతులు వేసి "ఉయ్ వన్ రా హేమంత్!" అంటూ.

డాక్టర్ విన్సెంట్ "లతా.. లేమ్మా హేమంత్ వచ్చాడు నీకోసం!" అంటూ చెంపలపై చిన్నగా తడుతూ కదిలిస్తున్నాడు లతను.

లత కనురెప్పలు కదులుతున్నాయేగాని ఆమె కళ్ళు తెరవలేదు.

హేమంత్ నెమ్మదిగా ముందుకు వాలి లత నుదుటిపై పెదవులతో తాకాడు "లవ్‌యు లతా..."అంటూ.

ఒక్కసారిగా, కలలో ఉలికిపాటులా ఉలికిపడింది ఆమె తనువు. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు హేమంత్. అతడి స్పర్శతో ఆమె తనువులోని అణువణువూ స్పందించింది ఒక్కసారిగా.

నెమ్మదిగా కళ్ళు తెరిచింది. హేమంత్ ముఖంలోకి చూసి కళ్ళు మూసుకుంది మళ్ళీ. తన చేతిని పట్టుకున్న అతడి చేతిని తన రెండో చేత్తో గట్టిగా పట్టుకుంది లత. ఆమె కంటికొనల నుండి నీళ్ళు పక్కలకు జారుతున్నాయి.

"ల...తా!" అన్నాడు. అతడి గొంతు పూడిపోయింది.

"ఇలా నావైపు చూడు లతా!" అంటూ ఆమె కళ్ళు తుడిచాడు చేత్తో.

"హేమ్!" అంది నెమ్మదిగా. "ఇది కలకదూ.. నేను కళ్ళు తెరిస్తే నువ్వు మాయం అయిపోతావా.. హేమ్?"

"లేదు లతా, ఇది కలకాదమ్మా నిజంగానే వచ్చాను." బాధగా అన్నాడు ఆమె తల నిమురుతూ.

"అవునా?!"

"అవును. నన్ను గిచ్చుతావా ఇన్నాళ్ళకు వచ్చావా అని."

వెంటనే కళ్ళు తెరిచింది లత.

"అదుగో చిట్టి తల్లి కళ్ళు తెరిచి చూస్తుంది." విన్సెంట్ మాటలలో వాత్సల్యం తొణికిసలాడుతుంది. సంతానానికి నోచుకోని ఆయన నచ్చినవారిని మానస బిడ్డలుగా అనుభూతి పొందుతాడు.

"హేమంత్, ప్రస్తుతం మెడిసిన్స్ కంటిన్యూ చేద్దాం అవే. నేను కాస్త రిలాక్స్ అయి మళ్ళీ వస్తాను, టేక్ కేర్" అంటూ డోర్ వైపు వెళ్తున్న విన్సెంట్‌ను, హేమంత్,

"సర్. కొంచెం ఆగండి. నేను లేచి రావటం కుదరదు. నా చెయ్యి ఇక్కడ లాక్ చేసేసింది" అన్నాడు నవ్వుతూ.

వెనక్కు వచ్చిన విన్సెంట్ నవ్వాడు, "మరి ఆ లాక్ కోసమేగా తపించావ్."

"సర్, లతకు నార్మల్ అయ్యేవరకు నేనే దగ్గరుండి మెడిసిన్స్ ఇవ్వటం, కేర్ తీసుకోవటం చెయ్యాలని వుంది మీ పర్మిషన్‌తో" అన్నాడు హేమంత్.

"హేమంత్, నేను పర్మిషన్ ఇవ్వకపోతే?" అన్నాడు అతడు.

"అపుడు మీరే దగ్గరుండి మీ కూతురిని చూసుకోవాలి సర్."

హేమంత్‌కు దగ్గరగా వెళ్ళి అతడిని దగ్గరకు తీసుకున్నాడు డాక్టర్ విన్సెంట్.

"ఈ రోజు చాలా శుభదినం హేమంత్. నీకు లత దొరికింది. నాకు మంచి కూతురు దొరికింది. కాని అల్లుడే నాటీబోయ్ దొరికాడు. అవునామ్మా లతా?" అన్నాడాయన.

"అవును డాడ్.. చాలా నాటీ." అంది నవ్వుతూ.

ఆమె 'డాడ్' అన్నందుకు అతడి మనసు స్పందించి, కళ్ళు చెమ్మగిల్లాయి.

"టేక్ కేర్ హేమంత్" అంటూ వెళ్ళాడాయన. కూడా అరుణ్ వెళ్ళి ఆయన కారు బయల్దేరాక తిరిగి వచ్చాడు.

"హేమంత్, నేను కొంచెం రిఫ్రెష్ అయి రౌండ్స్‌కు వెళ్తాను. నీకు మంచి కాఫీ పంపిస్తాను తాగు. బాగుంటుంది కాస్త."

"మర్చిపోయాను అవే టాబ్లెట్స్ ఇవ్వమన్నారు సర్. నేను వస్తాను." అంటూ వెళ్ళిపోయాడు అరుణ్.

"సర్, మీకు కాఫీ. మేడంకు బ్రేక్‌ఫాస్ట్" చెప్పింది సిస్టర్.

"నేను హెల్ప్ చెయ్యనా సర్?" అడిగింది.

"కొంచెం బెడ్ హైట్ పెంచాలి." అన్నాడు.

ఆమె అరేంజ్ చేసి వెళ్ళింది.

"లతా నా చెయ్యి వదులు. బ్రేక్ ఫాస్ట్ చెయ్యాలిగా నువ్వు." అన్నాడు.

"ఊహూ." అంది లత మరింతగా చేతిపై పట్టును బిగిస్తూ.

"ఇది కలా, నిజమా అనిపిస్తుంది. కలేమోనని భయంగా కూడా వుంది."

"ఆ డౌట్‌తోటే నీ చెయ్యివదలటం లేదు నేను."

"అయితే ఒక పని చేద్దాం. ఆ రోజు ఐస్‌క్రీం పార్లర్‌లో గిచ్చావు చూడు, అలా గిచ్చు ఒకసారి" అంటూ చెయ్యి ఆమెకు దగ్గరగా పెట్టాడు.

"అపుడు నువ్వు 'అమ్మా' అని అరిస్తే, పేషెంట్లంతా మంచాలు దిగి పారిపోతారేమో!" అంది నవ్వుతూ.

అతని చేతిని పెదవులకు దగ్గరగా పెట్టుకుని, "నన్నిక ఎపుడూ వదిలి వెళ్ళకు హేమ్."అంది లత. ఆమె కళ్ళలో మెరిసిన నీటి పొరను చూసి చెయిర్‌లోనుంచి లేచి దగ్గరగా వెళ్ళి ఆమె తలను గుండెకు ఆనించుకున్నాడు హేమంత్.

"లేదమ్మా.. ఎపుడూ నిన్ను వదిలి వెళ్ళను." అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. 'పాపం ఎన్ని బాధలు ఓర్చుకుందో నాకోసం!'

నెమ్మదిగా లత కోలుకుంటుంది. వాకింగ్ నెమ్మదిగా చెయ్యటం, కాసేపు సోఫాలో కూర్చుని టివి చూడటం చేస్తుంది . ఐసియు నుంచి ఒక రూముకు మార్చారు లతను.

హేమంత్ మందులవి తనే జాగ్రత్తగా ఇస్తున్నాడు. తనే అన్నీ చూసుకుంటున్నాడు.

డాక్టర్ విన్సెంట్‌కు లతను, హేమంత్‌ను చూస్తుంటే చాలా సంతోషంగా అనిపిస్తుంది. ఇక అరుణ్ ఆనందానికి పగ్గాలే లేవు. సుమ తరచూ వచ్చి, లతకు కావలసిన దుస్తులవీ తేవటం, ఆమెకు తల దువ్వటం, డ్రెస్ మార్పించటం చేస్తుంది.

ఉదయం బ్రేక్‌ఫాస్ట్ దగ్గర్నుంచి రాత్రి డిన్నర్ వరకు శ్రద్ధగా, లత ఆరోగ్యానికి సరిపడే విధంగా వండి పంపిస్తుంది ఆమె. తనపట్ల అందరు శ్రద్ధగా జాగ్రత్తలు తీసుకుంటున్నందుకు లోలోన చాలా సంతోషంగా ఉంది లతకు.

అన్నింటిని మించి హేమంత్ చాలా ఎక్కువ సమయం తన దగ్గరే ఉండటంతో కలిగే మనశ్శాంతితో హాయిగా అనుభూతి చెందటంవల్ల లత ఆరోగ్యం తొందరగానే యధాస్థితికి దగ్గరవుతుంది. డాక్టర్ విన్సెంట్ రోజులో రెండుసార్లైనా లత దగ్గర కూర్చుంటూ, కేవలం వైద్యానికే పరిమితం కావటంలేదు.

లతతో ఎన్నో కబుర్లు చెప్తాడతడు.

లతకు కూడా ఆయన వచ్చే సమయానికి ఎదురు చూడటం అలవాటైంది బాగా.

హేమంత్, "తండ్రీ కూతుళ్ళిద్దరూ కలిసి నన్ను మర్చిపోతున్నారు." అంటూనే తనూ హాయిగా భావిస్తాడు డాక్టర్ విన్సెంట్ తమపట్ల చూపుతున్న ప్రేమను. వారు మానసికంగా డాక్టర్ విన్సెంట్‌ను తమ ఇంటి పెద్దగా మార్చుకున్నారు తమకు తెలియకుండానే.

"హేమంత్." అంటూ లాంజ్‌లో కూర్చున్న హేమంత్ దగ్గరకు వచ్చాడు డాక్టర్ విన్సెంట్.

"మీతో కొంచెం మాట్లాడదామని ఇక్కడ వెయిట్ చేస్తున్నాను సర్." అంటూ లేచాడు హేమంత్.

"రా హేమంత్." అంటూ తన రూములోకి నడిచాడతడు. ఆయనను అనుసరించి వెళ్ళాడు హేమంత్.

"ఏంటి హేమంత్, అమ్మాయి ఏమంటుంది? ముఖంలో మళ్ళీ చదువుకునే రోజుల్లో ఉండే కళ వచ్చింది. బాగా రికవర్ అవుతుంది."

"అంతా మీ దయ సర్." అన్నాడు.

"అదేంకాదు హేమంత్, మనకు ఆ పై వాడి దయ ఉండాలి దేనికైనా. ఏం మాట్లాడాలి?"

"సర్ లతను రూమునుంచి నా సూట్‌కు షిఫ్ట్ చెయ్యాలనుంది మీ అనుమతితో." అడిగాడు హేమంత్.

"అదే మంచిది హేమంత్. తనకూ కొంచెం ఫ్రీగా ఉంటుంది మువ్ అవ్వటానికి. దానితో హెల్త్ ఇంకా ఇంప్రూవ్ అవుతుంది కూడా. మంచి రోజు చూసి షిఫ్ట్ చెయ్యి హేమంత్."

"అలాగే సర్."

"ఇక్కడే కనుక అందరం కూడా కేర్ తీసుకోవచ్చు. బి కేర్ ఫుల్ హేమంత్. డాక్టర్‌గా నీకు అన్నీ తెలుసు. లత ఎట్టి పరిస్థితుల్లో ఉద్వేగానికి గురికాకుండా చూసుకో. గతపు విషయాలు ఏమీ చెప్పకు ఇప్పట్లో. అలాగే పేరెంట్స్ గురించి కూడా అడిగితే ఏదో ఒకటి చెప్పు. అర్ధమైంది కదా." అన్నాడు డాక్టర్ విన్సెంట్.

"అలాగే సర్. మీ సలహాలన్నీ పాటిస్తా. నా సమస్యలు మీకు కాకపోతే ఎవరికి చెప్పుకోగలను?"

"ఏం సమస్యలున్నాయి. అన్నీ అయిపోయాయి, మరచిపోవాలి. హాయిగా జీవితం ప్రారంభించండి. ఇంకో విషయం చెప్పాలి మీకు. మీరు కొంతకాలం బయట ఎక్కువగా ఎక్స్‌పోజ్ కాక పోవటం మంచిది అని నా ఉద్దేశ్యం."

"అలాగే సర్."

"లత కోసం అవసరమైన ఫర్నీచర్ తీసుకో కంఫర్ట్ కోసం."

"అలాగే సర్. థాంక్యూ." అంటూ  వెళ్ళిపోతున్న హేమంత్‌ను చూసి 'పాపం అంత ఉత్తముడికి రావలిసిన కష్టాలు కాదు ఇవి.' అనుకున్నాడు అతడు.

అరుణ్, సుమ అవసరమైన షాపింగ్ అంతా చేసారు. ఒక్క రోజులో హేమంత్ సూట్‌ని ఆహ్లాదకరంగా మార్చేసారు.

చిన్న టివి స్థానంలో పెద్ద టివిని ఫిట్ చేసారు. లతకు కంఫర్ట్ కోసం తగినంత హైట్ ఉన్న కాట్, మంచి పరుపు, తలగడలు, అందమైన బెడ్‌షీట్లు ఏర్పాటు చేసారు.

ఓ పక్కన టేబుల్‌పై సిస్టమ్ పెట్టారు. గోడలపై అందమైన చిత్రపటాలను పెట్టారు. అడుగడుగున ఫ్లవర్ వాజ్‌లు అమర్చారు. చిన్న రౌండ్ ఎక్వేరియంలో రంగుల చేపలు ఈదుతున్నాయి. ఇన్డోర్ ప్లాంట్ ల పాట్‌లు అందంగా కార్నర్‌లలో అమర్చారు.

మంచి రోజును సుమ పంతులుగార్ని అడిగి కనుక్కుని చెప్పింది.

సూట్లోకి వెళ్ళేవరకు లత హేమంత్‌ల కూడా అరుణ్, సుమ ఉన్నారు. కాసేపు కూర్చుని వెళ్ళిపోయారు.

డోర్ క్లోజ్ చేసి వచ్చి సోఫాలో చేర్లబడ్డాడు హేమంత్.

"ఇక్కడ చాలా బాగుంది హేమ్. కాసేపు నా దగ్గర కూర్చోవా?" అడిగింది లత.

హేమంత్ నెమ్మదిగా లేచి వెళ్ళి లత పక్కన కూర్చున్నాడు.

"హేమ్, నీ ఒడిలో తలపెట్టుకుని పడుకోవచ్చా కాసేపు?"

లతను దగ్గరకు తీసుకున్నాడు హేమంత్.

"లతా ఏమనిపిస్తుంది?" అడిగాడు.

"జీవితంలో ఇంత సంతోషం ఎన్నడూ అనుభవం కాలేదు హేమ్." అంది అతడి కళ్ళలోకి చూస్తూ.

చటుక్కున చూపులను మరల్చుకున్నాడతడు.

"లతా జీవితంలో అలిసిపోయి ఉన్నాం. కొంతకాలం మనకు విశ్రాంతి అవసరం అనిపిస్తుంది."

"అవును చాలా పోరాడాను హేమ్ జీవితంలో... అలసిపోయాను. ఇలా నీ ఒడిలో సేద తీరే ఒక సమయం వస్తుందని గాని, అంతవరకు నేను ప్రాణాలతో ఉంటానని గాని ఊహించలేదు."

"అవును.. నేనూ నీలాగే ఊహించలేదు లతా." ఆమె ముఖం మీద ఫ్యాన్ గాలికి ఎగిరిపడుతున్న ముంగురులను వెనక్కు తీస్తూ అన్నాడు హేమంత్.

"హేమంత్.. ఒక్కపాట వినాలనిపిస్తుంది ప్లే చేస్తావా?"

"చెప్పు లతా."

" నీ సన్నిధిలో ఇలా సేద తీరుతున్నట్టు ఊహించుకుంటూ, నా మనసు పాడుకున్న పాట హేమ్!

ప్రతి క్షణం, మరుక్షణంలో నీవు వస్తావేమోనని ఆశపడుతూ, నా కన్నీళ్ళు పాడుకున్న పాట హేమ్! అటువంటి, అనేక వందల వేల లక్షల కోట్ల క్షణాలు గడచిపోతున్న గతంలోకి ప్రవహించిపోతుంటే, ఆశ నిరాశల మధ్య నలిగిపోతూ ఇదిగో ఈ క్షణం కోసం కన్నీళ్ళు ఇంకిపోయేవరకూ దుఃఖిస్తూ ఎదురు చూసాను హేమ్."

ఎగిసి వస్తున్న కన్నీళ్ళను నిగ్రహించుకుంటూ లతను నెమ్మదిగా దగ్గరకు తీసుకుని తల నిమురుతూ ఉండిపోయాడు.

"నిన్ను ఇంత హింసించినందుకు గిచ్చు. అంతేకాని శిక్షించకు లతా తట్టుకోలేను. అలిసిపోయాను లతా. నీ ఒడిలో విశ్రాంతి కావాలి నాకు." లతను తన భుజంపై తల పెట్టుకునేలా పరుండబెట్టాడు.

నెమ్మదిగా పక్కనున్న సెల్ తీసి పాటను ప్లే చేసాడు హేమంత్.

మల్లెల వానలా మనసును తడుపుతుంది పాట.

'మనసున మల్లెల మాల లూగెనే... కన్నుల వెన్నెల డోల లూగెనే..

........

'నీవు వచ్చేవనీ.. నీ పిలుపే వినీ.. కన్నుల నీరిడి కలయజూచితినీ..

ఘడియ ఏని ఇక విడిచిపోకుమా..

ఎగసిన హృదయము పగుల నీకుమా.. 'పాట అయిపోయింది.

"లతా" పిలిచాడు. అతడి కనురెప్పలను దాటిన నీటి ముత్యాలు జారి లత కనురెప్పల పై పడ్డాయి.

"అయ్యో హేమ్, నీతో కన్నీరు పెట్టించానా?" అంటూ లేచింది లత. పైట కొంగుతో అతడి కనురెప్పలను ఒత్తింది.

"పడుకో లతా, చాలా టైమ్ అయింది." అంటూ ఆమె తల క్రిందకు తలగడ సర్దాడు.

"హేమ్! " అంటూ అతడి చెయ్యి పట్టుకుని నెమ్మదిగా చెంపకు ఆనించుకుంది.

"నిద్రపో లతా, నీకు విశ్రాంతి చాలా అవసరం."

"నాకు తెలుసు హేమ్. కాని ఏదో భయం. నేను నిద్రపోతే, నువ్వు మళ్ళీ వెళ్ళిపోతావేమో!"

"లతా.. చిన్న పిల్లలా మాట్లాడకు. నీకు దూరంగా ఉండగలనా నేను మాత్రం?"

***(ముగింపు వచ్చే నెలలో)***

COMMENTS